క్లుప్తంగా

అపరాధ రుసుం లేకుండా పొగాకు విక్రయాలు

దేవరపల్లి: 2022–23 పంట కాలానికి సంబంధించిన రైతులు అధికంగా పండించిన వర్జీనియా పొగాకును, రిజిస్టర్ కాని రైతులూ పొగాకు బోర్డు వేలం కేంద్రాల్లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా విక్రయించుకోవడానికి బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం గెజిట్ విడుదల చేసినట్లు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోటరీక్లబ్ కార్యవర్గం ఎన్నిక


కీర్తి ఆంజనేయులు

నిడదవోలు: రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా కీర్తి ఆంజనేయులు, కార్యదర్శిగా గుంటుపల్లి శివకుమార్, ఉపాధ్యక్షుడిగా మీసాల హరిప్రసాద్, కోశాధికారిగా కాళ్ల రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా గరగ సాయిశ్రీనివాస్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రోటరీ ఆడిటోరియంలో ఈ నెల 9న సాయంత్రం 6.30 గంటలకు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నిర్వహించనున్నారని మాజీ అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తాళ్లపూడి: దాతలు అందిస్తున్న సాయంతో విద్యార్థులు బాగా చదువుకోవాలని మానవత మండల అధ్యక్షుడు సాయన సుబ్బారావు అన్నారు. పెద్దేవంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో తిగిరిపల్లి దోశాలు, అప్పన హనుమంతరావు, వి.చంద్రయ్య, గుప్త, యండపల్లి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు భద్రాచలం, వీరరాణి పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని గురువారం పట్టణంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, రాష్ట్ర మహిళా మోర్చా నాయకులు తాడిమళ్ల విజయవాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నీరుకొండ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు: స్థానిక విద్యానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో సాంకేతిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడదవోలు విద్యుత్ ఈఈ డి.వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్, బాలాజీనగర్, ఎస్టీ కాలనీ, యర్నగూడెం రోడ్డు, వైఎస్సార్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు.

నల్లజర్ల: అనంతపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో 33 కేవీ న్యూ బ్రేకర్ పనులతో శుక్రవారం అన్ని ఫీడర్లకు విద్యుత్తు అంతరాయం కలుగుతుంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా ఉండదని నిడదవోలు సబ్ డివిజన్ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

బంగారుకొండకు కలెక్టర్ దీవెనలు


ఇవాంశికతో కేక్ కట్ చేయిస్తున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జేసీ తేజ్ భరత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బంగారుకొండ కార్యక్రమంలో తాను దత్తత తీసుకున్న రేలంగి ఇవాంశిక పుట్టినరోజు వేడుకకు గురువారం కలెక్టర్ మాధవీలత హాజరయ్యారు. స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సమీపంలోని ఇవాంశిక ఇంటికి జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్‌తో కలిసి ఆమె వెళ్లారు. చిన్నారితో కేక్ కట్ చేయించి, బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను బంగారుకొండ కార్యక్రమం ద్వారా దత్తత తీసుకున్న అధికారులు బాధ్యతాయుత పాత్ర పోషిస్తున్నారన్నారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఎస్.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

సుజలం... సాకారం

- ప్రతి ఇంటికీ కుళాయిల ఏర్పాటు
- జల్‌జీవన్ నిధులు రూ.44.95 కోట్లతో పనులు
- తాగునీటి సమస్యలకు ఇక చెక్

దేవరపల్లి: గుక్కెడు నీటి కోసం పరుగులు తియ్యాల్సిన రోజులు పోయాయి.. గంగమ్మ ఇంటికే రానుంది.. ప్రజల దాహార్తి తీర్చనుంది.. అందరికీ తాగునీరు అందించడంలో భాగంగా జల్‌జీవన్ మిషన్ నిధులతో పల్లెల్లో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు పనులు ఊపందుకున్నాయి. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో మండలాల్లో దాదాపు 125 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అవసరమైన గ్రామాల్లో బోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం చేపడుతోంది. జల్‌జీవన్ మిషన్‌లో ఇప్పటి వరకూ కుళాయి లేని ప్రతి ఇంటికీ ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా కుళాయిలు ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికలు తయారు చేసి పనులు ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో పైపులైన్లు వేసి, అనంతరం గ్రామంలో పాడైన పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. నాలుగు మండలాల్లో 183 పనులకు రూ.44.95 కోట్లు మంజూరు కాగా పనులు వేగంగా జరుగుతున్నాయి. పైపులైన్లకు అవసరమైన పైపులు గ్రామ సచివాలయాల వద్ద సిద్ధంగా ఉన్నాయి. నల్లజర్ల మండలంలో రూ.27 లక్షలతో 4.4 కిలోమీటర్ల కొత్త పైపులైన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. పనుల్లో రాజీ పడవద్దని సిబ్బందికి సూచించారు.


దేవరపల్లిలో పైప్‌లైన్ల ఏర్పాటుకు సిద్ధం చేసిన పైపులు


కవులూరులో పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

మండలం	మంజూరైన పనులు	నిధులు (రూ.కోట్లలో)
దేవరపల్లి	47	7.37
గోపాలపురం	61	7.52
నల్లజర్ల	47	19.47
ద్వారకాతిరుమల	28	10.58
మొత్తం	183	44.95

అందరికీ నీరందించేందుకు..



గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీరు అందించేందుకు జల్‌జీవన మిషన్ పథకం ఎంతో ఉపయుక్తంగా మారింది. పైపులైన్లు వేసి కుళాయిలు లేని ఇళ్లకు ఉచితంగా కుళాయి ఏర్పాటు చేస్తున్నాం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పనులు జరుగుతున్నాయి. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 155 పనులు మంజూరు కాగా, 29 పనులు పూర్తయ్యాయి. 49 పనులు జరుగుతుండగా, 77 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అన్ని గ్రామాల్లో పైపులు సిద్ధంగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తాం.

–వి.అప్పారావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కొవ్వూరు

అదిగో అగ్రి టెస్టింగ్ ల్యాబ్


గోపాలపురం మార్కెట్ యార్డులో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

దేవరపల్లి: గోపాలపురం మార్కెట్ యార్డు ఆవరణలో నాబార్డు నిధులు రూ.55 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఈ నెల 8న ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ల్యాబ్‌కు ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.55 లక్షలు మంజూరు చేయగా, గోపాలపురంలో ల్యాబ్ నిర్మాణానికి 2020 అక్టోబర్ 29న శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణం పూర్తి కావడంతో అధికారులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ల్యాబ్ ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరీక్షించి రైతులకు సకాలంలో ఫలితాలను అందజేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలూ చేస్తారని వివరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- జగనన్న సురక్షతో మేలు

నిడదవోలు రూరల్: ఏ పథకం కావాలన్నా నాయకుల చుట్టూ తిరిగే రోజులు పోయాయని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. కోరుపల్లి, పురుషోత్తపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. కోరుపల్లిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. జగనన్న సురక్ష సర్వేలో వచ్చిన వినతులను నూరు శాతం పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. కోరుపల్లి సెంటర్ నుంచి పెండ్యాల వరకూ రూ.92 లక్షలతో రోడ్డు నిర్మాణంతో పాటు ఆర్టీసీ బస్సు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగరావు, సొసైటీ అధ్యక్షుడు ఆత్రేయపురపు రాజారావు, సర్పంచులు కారింకి అన్నవరం, మొక్కరాల శ్రీను, వెలగన నరేష్ పాల్గొన్నారు.


కోరుపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

చాగల్లు: ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, పథకాలు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందుతున్నాయని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు అన్నారు. నెలటూరు, దారవరం గ్రామాల్లో సభలు నిర్వహించారు. నెలటూరులో వైఎస్సార్ సీపీ నాయకులు గేడా శ్యామ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అందిస్తున్నారన్నారు. ఎంపీటీసీ తాళ్లూరి రమ్య, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. దారవరంలో సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ 658 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీటీసీ ఉబా భాగ్యవతి, ఎంపీడీవో బి.రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. పెద్దేవంలో ఎంపీపీ ఆధ్వర్యంలో సర్వే చేశారు. అలాగే తాళ్లపూడి పంచాయతీ వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ నక్కా అనురాధ, ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నక్కా చిట్టిబాబు, వంబోలు పోశిబాబు పాల్గొన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చారని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి అన్నారు. కానూరు, తీపర్రు గ్రామాల్లో సభలు నిర్వహించారు. కానూరులో 1,259, తీపర్రులో 845 దరఖాస్తులు రాగా వెంటనే వాటిని పరిష్కరించి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీడీఓ దామోదరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, కానూరు సర్పంచ్ బావన మధు, నాయకులు కొమ్మిశెట్టి రాము, తోట సురేష్ పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో ప్రజలకు మేలు

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం పడమర చోడవరం, పోతవరంలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులను గుర్తించి పథకాలు అందించడంతో పాటు సచివాలయాల పరిధిలో 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. జగనన్నను మరోసారి సీఎం చేసేందుకు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. పడమర చోడవరంలో 400 మందికి, పోతవరంలో 946 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పడమర చోడవరంలో గన్నమని సుబ్బారావు, భోగవల్లి రాజ్యలక్ష్మి, శ్రీరాములు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ పాల్గొన్నారు. పోతవరంలో సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పోతవరం లక్ష్మీ మాణ్యంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న 50 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని నివాసితులు కూనపాం పద్మ, సిరిబత్తుల రామలక్ష్మి తదితరులు కోరారు. 20 ఏళ్లుగా ఇంటి స్థలం లేక రహదారి పక్కన గుడిసె వేసుకొని ఇద్దరు ఆడపిల్లలతో ఉంటున్నానని, తనకు ఇల్లు మంజూరు చేయాలని అప్పికొండ నాగమణి కోరింది. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆమెకు ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

దేవరపల్లి: సమస్యలను నూరు శాతం పరిష్కరించడానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం లక్ష్మీపురం, బందపురం గ్రామాల్లో సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తారన్నారు. అనంతరం ఇంటి స్థల పట్టాలు, ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, సర్పంచ్ దొనెల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు.


పోతవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ఉండ్రాజవరం: పాలంగి, ఉండ్రాజవరం గ్రామాల్లో సచివాలయాల వద్ద జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. పాలంగిలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు పాల్గొని లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచులు బొక్క శ్రీనివాసు, మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ ఎస్.సరోజిని, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సంకురాత్రి సుబ్బారావు పాల్గొన్నారు.

నిడదవోలు: జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులందరికీ నూరు శాతం లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎస్‌కే ఖాన్‌భాషా అన్నారు. స్థానిక 11వ వార్డులో జగనన్న సురక్ష సర్వే చేపట్టారు. కౌన్సిలర్ చిలకల శారదాదేవి, వార్డు ఇన్‌చార్జి షేక్ జాకీర్‌హుస్సేన్, చిలకల మల్లికార్జునరావు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: ఆరికిరేవుల, దొమ్మేరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. అర్హులకు వివిధధ్రువీకరణ పత్రాలు అందజేశారు. దొమ్మేరులో ఎంపీడీవో కె.సుశీల, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, సర్పంచ్ తానేటి కుమారి పాల్గొన్నారు. ఆరికిరేవులలో సర్పంచ్ మట్టా శ్రీనివాస్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఈఓపీఆర్డీ శర్మ పాల్గొన్నారు.

జంతువులను కాపాడుకుందాం


కొవ్వూరులో పెంపుడు కుక్కలకు రేబిస్ ఇంజెక్షన్లు చేస్తున్న సిబ్బంది


పెరవలిలో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారి చరణ్

కొవ్వూరు: పెంపుడు జంతువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు జి.రాధాకృష్ణ, సహాయ సంచాలకులు ఎ.వెంకటరెడ్డి తెలిపారు. గురువారం కొవ్వూరులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంపుడు జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. జంతువులను ప్రేమగా ఆదరించాలని సూచించారు. అనంతరం పెంపుడు కుక్కలకు రేబిస్ ఇంజెక్షన్లు వేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కలగర వెంకట్రావు, పెనుమాక జయరాజు, కోశాధికారి ఉప్పులూరి రామకృష్ణ, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పరిమి హరిచరణ్, యనమదల సుబ్రహ్మణ్యం, ఎండీ హుస్సేన్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

చాగల్లు: జూనోసిస్ డే సందర్భంగా చాగల్లు పశువైద్యశాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ వీరాస్వామి, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి ప్రారంభించారు. అనంతరం పశు వైద్యాధికారి మాట్లాడుతూ 62 కుక్కలకు టీకాలు వేశామన్నారు.

పెరవలి: మండలంలోని పెరవలి, ఖండవల్లి, ముక్కామల, నడుపల్లి గ్రామాల పశువైద్య శాలల్లో 158 పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశామని పశు వైద్యాధికారి వి.చరణ్ తెలిపారు. కానూరు, నడుపల్లి సర్పంచులు బావన మధు, బీరా సత్యవేణిరాజు పాల్గొన్నారు.

నల్లజర్ల: పెంపుడు జంతువులను శుభ్రం ఉంచాలని నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశు వైద్యశాలలో పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ జరిగింది. ఏడీఏ మోజెస్‌వెస్లీ మాట్లాడుతూ నల్లజర్ల, పోతవరం, తూర్పుచోడవరం పశు వైద్యశాలతో పాటు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ర్యాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడు


జగ్జీవన్‌రామ్ ఫ్లెక్సీ వద్ద జేఏసీ నాయకులు

నిడదవోలు: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా దళిత, గిరిజన సంఘాల జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతలపాటి వెంకటేశ్వరరావు, గారపాటి ప్రసన్నకృష్ణ, టి.నాని, ఎల్లే పండు, షాహి, నజీర్, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నేత సతీమణి మృతి


మాజేటి వైదేహి (ఫైల్)

కొవ్వూరు: స్థానిక పట్టణ ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షుడు, రైస్ అండ్ కిరణా మార్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాజేటి బాబూజీ సత్యనంద వరప్రసాద్ (దత్తుడు) సతీమణి వైదేహి (60) గురువారం మృతి చెందారు. రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతికి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు సత్యవరపు గోపాలకృష్ణ, మట్టే ప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్, మద్దుల సత్యనారాయణ, నాళం వీరవెంకట శ్రీనివాసరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పర్యటన సాగింది. డి.ముప్పవరం గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు పథకాలు అందిస్తూ సీఎం జగన్ వారికి అండగా ఉంటున్నారన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. గ్రామ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. సర్పంచ్ నాగిరెడ్డి నాగదేవి, ఎంపీటీసీ సభ్యుడు సంగినీడి సత్యానారాయణ, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, నాయకులు నాగిరెడ్డి సత్తిపండు, మద్దాల ప్రభు, ముప్పిడి వెంకట్రావు, అజయ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


డి.ముప్పవరంలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. కోరుపల్లిలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్స్ లేకుండా చూడండి

ఉండ్రాజవరం: ప్రభుత్వ పాఠశాలల నుంచి డ్రాప్ అవుట్స్ లేకుండా మండల విద్యాశాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, రుడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి అన్నారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు చేర్చాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు, అమ్మ ఒడి వంటి అనేక పథకాలు చేపట్టిందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో తమ పరిధిలోని పనుల ప్రగతిపై సమీక్షించారు. ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, ఎంఈఓలు సక్సేనా రాజు, శారదా జ్యోత్స్న, హౌసింగ్ ఏఈ ఎం.విక్టర్‌బాబు, పీఆర్ ఏఈ భగవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి బాలస్వామి

ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడికి సత్కారం

కొవ్వూరు: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కోనా శ్రీనివాసరావును గురువారం కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండలంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడిగా కోనా పనిచేస్తూ సంఘీయుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. పట్టణ సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ, కార్యదర్శి నాళం వీరవెంకట శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్, జిల్లా కార్యదర్శి నుదుమాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరులో శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

మోసగించాడంటూ ఫిర్యాదు

కొవ్వూరు: తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ వ్యక్తి మోసగించినట్లు పట్టణానికి చెందిన ఆబోతు వినోద ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. వినోద భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పెద్దేవం గ్రామానికి చెందిన యండపల్లి నాగరాజుతో పరిచయం ఏర్పడింది. గతనెల 26న కొవ్వూరులో తన ఇంటికి వచ్చి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించినట్లు ఆమె ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా కులం పేరుతో దూషించినట్లు బాధితురాలు ఫిర్యాదు ఇచ్చినట్లు సీఐ వివరించారు.

ఒకరిపై దౌర్జన్యం

స్థానిక అగ్నిమాపక కేంద్రం జంక్షన్ వద్ద బుధవారం రాత్రి మోటారు సైకిల్‌పై వెళుతున్న తనను పట్టణానికి చెందిన విశ్వకోట మోహర్, వీర్ల నాని కారులో వచ్చి ఢీకొట్టారని రెండో వార్డుకు చెందిన నీరుకొండ శ్రీరామకృష్ణ తెలిపారు. దీనిపై ప్రశ్నించినందుకు దూషించడమే కాకుండా ఇరువురూ కలసి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ బాబూరావు కేసు నమోదు చేశారు.

బైక్ చోరీపై కేసు

కొవ్వూరు: బైక్ చోరీ ఘటనపై రూరల్ ఏఎస్సై వై.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. నిడదవోలు మండలం పందలపర్రు గ్రామానికి చెందిన రేకపల్లి రవి పడవపై ఇసుక కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగా 2వ తేదీ రాత్రి పడవపై ఇసుక సేకరించే నిమిత్తం వెళుతూ తన బైక్‌ను సీతంపేట రేవు వద్ద పెట్టాడు. మూడో తేదీ ఉదయం పనులు ముగించుకుని వచ్చేసరికి బైక్ కనిపించలేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.